క్లుప్తంగా

వడదెబ్బకు గురికావొద్దు

• రూరల్ సీఐ తిరుపతిరావు



ప్రజలకు మంచినీరు, మజ్జిగ అందజేస్తున్న రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్సై గణేష్

విజయనగరం క్రైమ్: ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నందున అవసరమైతే తప్ప రోడ్ల పైకి రావొద్దని, అకారణంగా వచ్చి వడదెబ్బకు గురికావద్దని రూరల్ సీఐ టీవీ తిరుపతిరావు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం స్థానిక వీటీ అగ్రహారం జంక్షన్ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ప్రజలకు మంచినీరు, మజ్జిగ అందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రూరల్ ఎస్సై బి.గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న మాజీ సైనికులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం చలివేంద్రం ఏర్పాటుచేశారు. వాహన చోదకులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు తుమ్ము మహేష్, బొలే శ్రీను, ఎచ్చెర్ల తవుడు, నల్లి రాంబాబు, సముద్రపు సత్తిబాబు, సముద్రపు శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

నిల్వ నీటితో ఇక్కట్లు



ఆర్‌యూబీ వద్ద నిలిచిన వర్షపునీరు

నెల్లిమర్ల: పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వర్షపునీరు నిల్వ ఉండడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. స్థానిక రామతీర్థం జంక్షన్ నుంచి రామతీర్థం వైపు వెళ్లే దారిలోనున్న ఈ బ్రిడ్జి దిగువన ఏ మాత్రం వర్షం పడినా నీరు నిలిచిపోతోంది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. రైల్వే అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని పలువురు కోరుతున్నారు.

భూమిని పరిరక్షించుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి

విజయనగరం ఫూల్‌బాగ్: భూ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలనీ డీఈఓ బి. లింగేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ధరిత్రీ దినోత్సవం సందర్భంగా ఏపీఎన్‌జీసీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కస్పా హైస్కూల్ నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కస్పా హైస్కూల్‌లో భూ పరిరక్షణపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓలు కె. వాసుదేవరావు, ఎన్‌టీ నాయుడు, డీసీఈబీ సెక్రటరీ టి. సన్యాసిరాజు, జిల్లా సైన్స్ అధికారి ఎం. కృష్ణారావు, ఎన్‌జీసీ కోఆర్డినేటర్ బి. వేణుగోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకే మద్దతు..



కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

డెంకాడ: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకే మద్దతు పలుకుతోందని సీపీఎం నాయకుడు బి.సూర్యనారాయణ అన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ డెంకాడలో సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశన్నంటాయని, అలాగే నిత్యావసర ధరలు కూడా రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు మోదీ ప్రభుత్వం కంకణం కట్టుకుందని ఆరోపించారు. బీజేపీకి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటానికి ప్రతి ఒక్కరూ మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంపై వేటు..



ఆకస్మిక తనిఖీల్లో భాగంగా కార్యదర్శులతో మాట్లాడుతున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

• సచివాలయ సేవలపై కమిషనర్ ప్రత్యేక దృష్టి
• విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న వారిపై చర్యలు
• కార్పొరేషన్ పరిధిలో ఆరుగురు సచివాలయ కార్యదర్శులు సస్పెన్షన్



నగరంలోని వార్డు సచివాలయం

విజయనగరం: ప్రజలకు క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ సేవలందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన సచివాలయ వ్యవస్థలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కార్పొరేషన్ కమిషనర్ కొరఢా ఝుళిపిస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించడంతో పాటు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇటీవల నగరంలో వివిధ సచివాలయాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్న ఆరుగురు కార్యదర్శులపై సస్పెన్షన్ వేటు విధించారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 61 వార్డు సచివాలయలు ఉన్నాయి. వీటిలో 8 ప్రభుత్వ భవనాల్లో నిర్వహిస్తుండగా... మరో 53 సచివాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. వీటి పరిధిలో 540 మంది కార్యదర్శులుగా వివిధ విభాగాలకు అనుబంధంగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వపరంగా అందించే సంక్షేమ పథకాలతో పాటు ఆయా ప్రాంతాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాల్లో వీరు కీలకపాత్ర పోషించాల్సి ఉండగా... పలువురు కార్యదర్శుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. దీంతో కార్పొరేషన్ కమిషనర్ ఇటీవల నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి తనిఖీలు నిర్వహించడంతో పలువురు ఉద్యోగుల బాగోతం బయటపడటం గమనార్హం. సమయపాలన పాటించకపోవడం, నిర్ణీత సమయంలో హాజరు నమోదు చేయకపోవడం, సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండకపోవడం, జాబ్‌చార్ట్ ప్రకారం విధులు నిర్వహించకపోవడాన్ని గుర్తించారు. సచివాలయాల్లో శానిటేషన్, పర్యావరణ, పరిపాలన, సౌకర్యాల కల్పన, విద్య, డేటా ప్రాసెసింగ్, సంక్షేమం, అభివృద్ధి, ప్లానింగ్, రెగ్యులేటర్ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. వీరందరూ సమయపాలన పాటించాలని బయోమెట్రిక్ హాజరును అమలు చేస్తున్నారు. అయినా కొందరు సచివాలయ కార్యదర్శులు నిర్ణీత సమయానికి హాజరుకాని పరిస్థితులు న్నాయి. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 వరకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్పందన కార్యక్రమంలో స్వీకరించాల్సి ఉండగా... చాలా వరకు కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. దీంతో నగరంలో సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కఠిన చర్యలకు ఉపక్రమిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

కఠిన చర్యలు తప్పవు..

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు. నగరంలోని 61 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి రోజూ రెండు నుంచి మూడు సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తాం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారితో పాటు ప్రజలకు అవసరమైన సేవలందించడంలో జాప్యం చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో ఇలాంటి లోపాలను గుర్తించి ఆరుగురు కార్యదర్శులను సస్పెండ్ చేశాం. రానున్న రోజుల్లో తనిఖీలు ముమ్మరం చేస్తాం. ప్రజలకు మెరుగైన సేవలందించే దిశగా చర్యలు తీసుకుంటాం.

– రెడ్డి శ్రీరాములనాయుడు, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్

ఊటగెడ్డలో వ్యర్థాలు..



వ్యర్థాలతో నల్లగా మారిన ఊటగెడ్డ జలాలు

• ప్రధాన రహదారి పరిసరాల్లో దుర్గంధం
• ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

నెల్లిమర్ల: జిల్లా కేంద్రమైన విజయనగరం నుంచి నెల్లిమర్ల పట్టణానికి వచ్చే ప్రధాన రహదారిలోనున్న ఊటగెడ్డలో పలువురు సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో గెడ్డలోని జలాలు కలుషితమవడమే గాకుండా ఈ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతోంది. విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో డైట్ కాలనీ పరిధిలో ఊటగెడ్డ ఉంది. సారిపల్లి జంక్షన్ దాటిన తర్వాత ఉన్న ఈ గెడ్డను కొంతమంది కలుషితం చేస్తున్నారు. విజయనగరానికి చెందిన సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను గెడ్డలో పారబోస్తున్నారు. రాత్రి వేళల్లో ట్యాంకులతో వ్యర్థాలను తీసుకొచ్చి ఈ గెడ్డలో వేస్తున్నారు. అలాగే పలువురు చికెన్ సెంటర్ల నిర్వాహకులు కూడా కోళ్ల వ్యర్థాలను ఇదే గెడ్డలో పారబోస్తున్నారు. దీంతో గెడ్డలోని జలాలు ఇప్పటికే కలుషితమయ్యాయి. నీరంతా నల్లగా మారిపోవడంతో పాటు దుర్గంధం వస్తుండడంతో రహదారిపై రాకపోకలు చేసే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నీరు కలుషితం కావడంతో పశువులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు, వాహనదారులు రోగాలబారిన పడే ప్రమాదముంది. చాలాకాలంగా ఊటగెడ్డలో వ్యర్థాలను పారబోస్తున్నప్పటికీ విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు పబ్లిక్ హెల్త్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊటగెడ్డ విజయనగరం పరిధిలోకి వస్తుందనే నెపంతో నెల్లిమర్ల నగరపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన పబ్లిక్ హెల్త్ అధికారులు ఇప్పటికైనా స్పందించి గెడ్డలో వ్యర్థాలను పారబోసే సెప్టిక్ క్లీనింగ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సస్పెన్షన్‌లను ఖండిస్తున్నాం..

• ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి

విజయనగరం ఫూల్‌బాగ్: ఉపాధ్యాయులను అన్యాయంగా సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి పేర్కొంది. ప్రధానోపాధ్యాయుల సంఘ నాయకుడు (విజయనగరం) టి.సన్యాసిరాజు అధ్యక్షతన శనివారం స్థానిక ఏపీఎన్‌జీఓ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాలకు చెందిన నాయకులు మాట్లాడుతూ, ప్రధానంగా విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పార్వతీపురం – మన్యం జిల్లా పర్యటనలో ఉద్దేశపూర్వకంగానే మన్యం జిల్లా విద్యాశాఖాధికారి రమణ, వీరఘట్టం మండల విద్యాశాఖ అధికారి కృష్ణమూర్తి, ఏజీసీడీఓ రోజారమణి, కేజీబీవీ ఇన్‌చార్జ్ స్పెషల్ ఆఫీసర్ రోహిణిని అన్యాయంగా సస్పెండ్ చేశారన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకుని సస్పెన్షన్‌లను ఎత్తివేయాలని కోరారు. సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు డి. రాము, డి. ఈశ్వరరావు, పి. శ్రీనివాస్, డి. శ్యామ్, వై. అప్పారావు, వి. రవీంద్రనాయుడు, బి. గోవింద నాయుడు, ఎస్‌వీ శ్రీకాంత్, ఈ. రామునాయుడు, అమర్నాథ్, రాము, సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

విజయనగరం ఫూల్‌బాగ్: ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీకి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27న పట్టణంలోని రంజని థియేటర్ ఎదురుగా ఉన్న ఎల్లమ్మ తల్లి గుడి పక్కన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు తెలిపారు. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ముందుగా ప్రచారభేరి కార్యక్రమానికి చెందిన వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఎస్.రంగరాజు, ఎ. జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట..



జోరువానలో గంటస్తంభం ప్రాంతం



తడుస్తూ వెళుతున్న మహిళలు

కొద్ది రోజులుగా భానుడి ప్రతాపానికి గురైన జిల్లా వాసులకు వర్షంతో ఊరట లభించింది. విజయనగరం జిల్లా కేంద్రంతో పాటు పూసపాటిరేగలో కూడా వర్షం కురిసింది. ఒక్కసారిగా శనివారం మధ్యాహ్నానికి వాతావరణం మారిపోయి మబ్బులేసింది. అక్కడకు కొద్ది సేపటికి జోరువాన కురవడంతో పట్టణంలోని కాలువులు పొంగిపొర్లాయి. పూసపాటిరేగ మండల కేంద్రంతో పాటు పేరాపురం, వెంపడాం, గుంపా తాళ్లపేట గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. రబీ సాగుకు వర్షం అనుకూలమని రైతులు చెబుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం/పూసపాటిరేగ



జోరు వాన అయినా ఆగని జీవన ప్రయాణం



వర్షంలో పాదచారులు



పూసపాటిరేగలో కురుస్తున్న వర్షం

ప్రతి ఒక్కరి నోట జగనన్న మాట..



ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

• 21వ డివిజన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం..
• ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ప్రతి ఒక్కట నోటా ఒకటే మాట... మా జగనన్న మంచి పాలన అందిస్తున్న గొప్ప నాయకుడు... ఇటువంటి మనసున్న నాయకుడు మరలా ముఖ్యంత్రి కావాలని కోరుకుంటున్నామని ఆనందంతో చెబుతుండడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనపై ప్రజా విశ్వాసానికి అద్దం పడుతోంది. నగరంలోని 21వ డివిజన్‌లో నాలుగో రోజైన శనివారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. సందడి వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లు, అమ్మఒడి, ఆసరా, వసతి దీవెన, చేయూత వంటి పథకాలపై కోలగట్ల, తదితరులు ఆరా తీశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పనితీరు ఎలా ఉందని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో ప్రతి ఒక్కరూ పాలనపై సంతృప్తి వ్యక్తం చేయడం విశేషం. ఎక్కడా ఎటువంటి అవినీతి గాని లంచాలు గాని లేకుండా పథకాలు అందిస్తున్నారని పలువురు కోలగట్ల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, 21వ డివిజన్‌లో నిర్వహిస్తున్న గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమం నాలుగో రోజుకు చేరిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నగరాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేయడం మనందరి అదృష్టమని చెప్పారు. ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామిని మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. డివిజన్ అధ్యక్షుడు కనకల గిరి మాట్లాడుతూ, కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో నగరం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ప్రధాన జంక్షన్ల అభివృద్ధితో పాటు ఐదుచోట్ల పేద ప్రజల ఆకలి బాధలు తీర్చే ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, జోనల్ ఇన్‌చార్జ్ కాళ్ల సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 2న నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా మహాసభ



మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: పట్టణంలోని సంతమార్కెట్ వద్ద వచ్చే నెల 2న ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సంఘ జిల్లా మహాసభ నిర్వహించనున్నట్లు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు తెలిపారు. శనివారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్‌లోని ప్రజాగ్రంథాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయీ బ్రాహ్మణ సమస్యల పరిష్కారం కోసం మహాసభలో చర్చించనున్నట్లు తెలిపారు. నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి విడుదల చేసిన జీఓల అమలుకు అందరు ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహాసభలకు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్. సురేష్, టి. సత్యనారాయణ, ఎ. అప్పారావు, పి. సిమ్మయ్య పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు అతికించడంపై ఫిర్యాదు

విజయనగరం క్రైమ్: ఈద్ పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు వ్యక్తులు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా హిందూ ఆధ్యాత్మిక సంస్థ కార్యాలయాల గోడలపైన, మహనీయుల ఫొటోలపైన ఈద్‌ముబారక్ వాల్‌పోస్టర్లు అతికించడంపై 34వ వార్డు వీఆర్‌ఓ అజయ్‌కుమార్ వన్‌టౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదుచేశారు. రామకృష్ణా సేవాసమితి కార్యాలయం, మూడులాంతర్లు, టీటీడీ కల్యాణ మంటపం, గురజాడ సమాఖ్య గ్రంథాలయం ప్రాంతాల్లో గోడలపై వాల్‌పోస్టర్లు అంటించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపారు.

‘జగనన్నే మాభవిష్యత్’ కార్యక్రమంపై సమీక్ష



జేసీఎస్ కన్వీనర్లతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

బొండపల్లి: ‘జగనన్నే మాభవిష్యత్– మానమ్మకం నువ్వే జగన్’ కార్యక్రమాన్ని గజపతినగరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో శతశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జేసీఎస్ మండల కన్వీనర్లపై ఉందని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. నియోజక వర్గంలోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి,గంట్యాడ, జామి మండలాల జేసీఎస్ కన్వీనర్లతో విజయనగరంలోని తన క్యాంపు ఆఫీస్‌లో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమాన్ని మండలాల వారీగా ఏయే గ్రామాల్లో శతశాతం పూర్తయింది, ఇంకా ఏయే గ్రామాల్లో ఎన్ని ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, వారి అనుమతితో మానమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇంటి గోడకు అతికించాలని సూచించారు. నియోజకవర్గంలో మరో రెండు రోజుల్లో కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేయాలని చెప్పారు. ఆయా మండలాల జేసీఎస్ కన్వీనర్లు కనకల సుబ్రహ్మణ్యం, మహదేవ ఫణీంద్రుడు, పల్లి రఘు, రామసూర్యం, సీర చందు నాయుడు పాల్గొన్నారు.

బాధితులకు అండగా నిలుస్తాం

• మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి

చీపురుపల్లి: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి చెప్పారు. పట్టణంలోని రుంకానవీధిలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నాలుగు కుటుంబాలను శనివారం ఆమె పరామర్శించారు. అనంతరం డాక్టర్ బొత్స సందీప్ నెలకొల్పిన ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల నగదు, దుస్తులు, కిరాణా సామగ్రి, వంట పాత్రలు, నిత్యావసర సరుకుల పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి పక్కా ఇళ్లు మంజూరయ్యే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. బాధితులు కొత్త ఇళ్లు నిర్మించుకునే సమయంలో ద్వారాలు, తలుపులు, కిటికీలు, విద్యుద్దీకరణ వంటి పనులను ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, దన్నాన జనార్దన, వాకాడ శ్రీనివాసరావు, పతివాడ రాజారావు, ముల్లు పైడిరాజు, ధీర ఫౌండేషన్ ప్రతినిధి రేగుల వినోద్ పాల్గొన్నారు.